సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం : 7 : ఏప్రిల్ : 2023



న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 8,961 మంది విద్యార్థులకు గాను 8,944 మంది హాజరయ్యారు. 17 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మోడల్ స్కూళ్ల అడిషనల్ డైరెక్టర్ రమణ్‌కుమార్, డీఈఓ పరిశీలించారు.

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామివారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ఆలయ మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

వైభవంగా గాయత్రి హవనం



మహాయజ్ఞం నిర్వహిస్తున్న పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్టలో అఖండ నామ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహాయజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం మంగళ హారతి, తులసీ, గురు, గోమాత, అశ్వ దేవతా, శృంగార హారతి, నారాయణీయం పారాయణం, అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ యజ్ఞం, గణపతి హోమం, నక్షత్ర పూజలు, శ్రీసుదర్శన గాయత్రి హవనం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వరకు అఖండ హరినామ దీక్ష, భగవద్గీత తరగతి, పారాయణం, ప్రవచనం, సనాతన ధర్మ, సర్వ సంప్రదాయ సమన్వయ సదస్సు, యాదాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అఖండ నామ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య

తుర్కపల్లి : ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ అధికార ప్రతినిధి బీర్ల అయిలయ్య విమర్శించారు. గురువారం తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్, బాబ్లునాయక్‌తండా, చోక్ల తండాలో, పెద్దతండా, రాంపూర్ తండాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట రుణాల మాఫీ, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించిన సీఎం కేసీఆర్.. హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఎంపీటీసీలు మోహన్‌బాబునాయక్, కానుగంటి శ్రీనివాస్‌యాదవ్, ప్రతిభరాజేశ్‌నాయక్, వనజహన్మంత్‌రెడ్డి, సర్పంచ్‌లు బాబునాయక్, బిచ్చునాయక్, మహిళా అధ్యక్షురాలు ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, చాడ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో వైభవంగా తెప్పోత్సవం



విష్ణు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెప్పోత్సవాన్ని తొలిసారిగా గురువారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ వేడుక నిర్వహించినట్లు ఆలయ ఆచార్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను భాజాభజంత్రీలతో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ కొండపైన గల విష్ణు పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం పుష్కరిణిలోని మండపం వద్ద స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను పుష్కరిణిలో తెప్పోత్సవంగా ఊరేగించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ వేడుకను కనులారా వీక్షించారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

● జై హనుమాన్



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం భువనగిరిలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

అత్యున్నతంగా ఎయిమ్స్

750 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- వైద్య విద్యార్థుల కోసం 24 అంతస్తుల్లో రెండు టవర్లు
- ఫ్యాకల్టీ, సిబ్బందికి ప్రత్యేక భవనాలు
- పరిశోధనలకు అధునాతన ల్యాబ్‌లు
- రూ.1,365 కోట్ల వ్యయంతో నిర్మాణాలు
- రేపు వర్చ్‌వల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ



బీబీనగర్ ఎయిమ్స్ మాస్టర్‌ప్లాన్ ఏరియల్ వ్యూ

సాక్షి,యాదాద్రి : అత్యున్నత వైద్య ప్రమాణాలకు చిరునామాగా మారనుంది.. బీబీనగర్ ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్). 750 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతి కోసం 24 అంతస్తుల్లో రెండు టవర్లు.. ఇలా మరెన్నో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకోనుంది. వీటితో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలూ కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ అమలుకు ఎయిమ్స్ అధికారులు చర్యలు చేపట్టారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వివిధ నిర్మాణాలకు ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాన మంత్రి స్వాస్థ్ యోజనలో రూ.1.365.95 కోట్ల వ్యయంతో ఏడాది లోపు ఎయిమ్స్‌ను పూర్తి చేయనున్నారు.

అత్యాధునిక వైద్యం, మౌలిక వసతుల కల్పన

పూర్తిస్థాయిలో అత్యాధునిక ఆరోగ్య, మౌలిక సదుపాయాల కల్పన కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఇందులో భాగంగా 750 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల అనుబంధ సంస్థలను ప్రారంభించే దిశగా చర్యలు ప్రారంభం



నూతన హాస్పిటల్ బ్లాక్ నమూనా

అయ్యాయి. ఇవన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాతో పాటు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్యం అందనుంది.

నిర్మించనున్న భవన సముదాయాలు ఇలా..

ఎయిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల వసతి కోసం 24 అంతస్తుల్లో రెండు అత్యాధునిక టవర్లు నిర్మిస్తారు. 750 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 300 మంది పీజీ విద్యార్థులు ఇక్కడ చదువుకోనున్నారు. వీరితోపాటు 300 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఉంటారు. డాక్టర్లు, లెక్చరర్ల థియేటర్, ఎగ్జామ్ హాల్, రీసెర్చ్ ల్యాబ్, 22 ఫ్యాకల్టీల రీసెర్చ్ ల్యాబ్‌లతో పాటు నర్సింగ్, పారామెడికల్ స్టాఫ్ వసతి గృహాలు నిర్మించనున్నారు. అంతేకాకుండా మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఆస్పత్రి భవనం, న్యూ ఆస్పత్రి బ్లాక్, అకడమిక్ బ్లాక్, ఆడిటోరియం, ఆయూష్ బ్లాక్, రోగుల వెంట వచ్చే వారికోసం నైట్ షెల్టర్, మార్చురీ, డైరెక్టర్ రెసిడెన్సీ, గెస్ట్‌హౌజ్ అండ్ క్లబ్, ఆరు రకాల క్వార్టర్స్, యూజీ బాలుర, బాలికల వసతి గృహాలు, పీజీ బాలుర, బాలికల వసతి గృహాలు, పీజీ వర్కింగ్ నర్సుల హాస్టల్, డైనింగ్ బ్లాక్, కమ్యూనిటీ బిల్డింగ్, సర్వీస్ బిల్డింగ్, అమృత్ దార, అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంక్, ప్యానల్ రూం రానున్నాయి.

పచ్చదనానికీ ప్రాధాన్యం

అత్యాధునిక మౌలిక వసతులతో పాటు పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆహ్లాదం పంచేలా పార్కులు రానున్నాయి. పోస్టాఫీస్, బ్యాంకు ఇతర మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

భువనగిరిటౌన్ : మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ, దళిత సంఘాల ప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పూలే జయంతి వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు వివిధ సంఘాల ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు వివిధ సంఘాల ప్రతినిధులు వేడుకల్లో పాల్గొనేలా చూడాలనిక వారికి సూచించారు.కాలేజీ విద్యార్థులను సైతం భాగస్వామ్యం చేయాలన్నారు. భువనగిరిలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహాన్ని అందంగా అలంకరించాలని, సభా వేదిక వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భువనగిరిలో బీసీ సంక్షేమ సంఘ భవనం నిర్మాణానికి స్థలం కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ గిరిధర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఈనెల 11న భువనగిరిలోని జగదేశ్‌పూర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ దీపక్ తివారీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన కార్యవర్గం



అజయ్‌మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు

మోత్కూరు : రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్, ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రాను గురువారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గల సంస్థ ప్రధాన కార్యాలయంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం మర్యాద పూర్వకంగా కలిసింది. అజయ్‌మిశ్రాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. అదే విధంగా రెడ్‌క్రాస్ సీఈఓ మదన్‌మోహన్‌రావు, ఏఓ కోటిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డైరెక్టర్లు కె.ప్రభాకర్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎన్.చారి, ఎండీ ఖలీల్, పెసర శంకర్‌రెడ్డి, గునగంటి భిక్షం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు నాటకం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



పార్టీ జెండాను ఎగురవేస్తున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ : ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ కొత్త నాటకాలకు తెరలేపిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ సర్కార్ చేతగాని పాలన, అవినీతిని ప్రజలు గుర్తించారని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని గ్రహించి బీజేపీపై కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఆవిర్భా దినోత్సవాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెంలో గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ, పదవ తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీలకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వం చేతిలో మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఎలాంటి ప్రమేయం లేకున్నా కుట్రపూరితంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. అక్రమంగా దోచుకున్న సొమ్ముతో ప్రధానమంత్రి పదవిని కొనుక్కునేందుకు కేసీఆర్ అత్యాశపడుతున్నాడని, అది కలగానే మిగులుతుందని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నం లావణ్యమల్లేష్, ఉపసర్పంచ్ కొంతం రామకృష్ణారెడ్డి, నాయకులు పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, కొంతం బుచ్చిరెడ్డి, బద్రి లింగయ్య, జాల మల్లేష్, గునగంటి స్వామి, సుర్కంటి లింగారెడ్డి, కొంతం కృష్ణారెడ్డి, పిసాటి శశిధర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సాయిబాబా, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదని దీక్ష



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న ఆనంద్, బాలమణి దంపతులు

ఆలేరు రూరల్ : అన్ని అర్హతలు ఉన్న తమకు డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదని ఆలేరు పట్టణానికి చెందిన ఆనంద్, బాలమణి దంపతులు చంటిబిడ్డతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్నారు. తమది రెక్కాడితేనే డొక్కాడే కుటుంబం అని, సొంతిల్లు లేకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్లాట్ ఉందన్న కారణంతో తమ పేరు డ్రాలో వేయలేదని ఆరోపించారు. అనర్హులకు ఇళ్లు కేటాయించారని మాలాంటి నిరుపేదలకు అన్యాయం జరిగిందని కంటతడి పెట్టారు. అధికారుల తీరుకు నిరసనగా దీక్ష చేపట్టామని, తమకు న్యాయం జరిగే వరకు కొనసాగిస్తామన్నారు.



చేనేతకు ఈ-మార్కెటింగ్ సౌకర్యం

- ఉత్పత్తులు నేరుగా అమ్ముకునే అవకాశం
- దళారుల ప్రమేయానికి చెక్
- ఆన్‌లైన్‌లో మొదలైన పేర్ల నమోదు

10లో

ఊరూరా బలగం సినిమా

- ప్రతి గ్రామంలో ప్రదర్శన
- చిత్రంలోని సన్నివేశాలు చూసి భావోద్వేగం
- పాత రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న జనం



సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్‌లో బలగం సినిమాను వీక్షిస్తున్న గ్రామస్తులు

సాక్షి, యాదాద్రి : తెలంగాణ పల్లెల్లోని ప్రతి గడపలో యథార్థ సంఘటనలు కళ్లకు కట్టిన బలగం సినిమా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎంతో మంది ఆదరాభిమానాలు పొందుతున్న ఈ సినిమాను ఇప్పుడు ప్రతి ఊరిలో ప్రదర్శిస్తున్నారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారు. ఊరి జనమంతా మూకుమ్మడిగా సినిమాను వీక్షిస్తూ అందులోని సన్నివేశాలకు భావోద్వేగానికి లోనవుతున్నారు. వివిధ కారణాలతో విడిపోయిన కుటుంబాలకు, అన్నదమ్ముళ్లకు ఈ సినిమా బంధాలను గుర్తుకు తెస్తోంది.

నాయకులు, గ్రామ పెద్దల సహకారంతో..

తెలంగాణ ప్రజల జీవన విధానం, రక్త సంబంధానికి అద్దంపట్టే విధంగా ఉన్న బలగం సినిమాను ఇప్పటికే చాలా గ్రామాల్లో ప్రదర్శించారు. మిగతా గ్రామాల్లో కూడా ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ చావిడి, కచ్చీరు, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఇందకు అయ్యే ఖర్చులను రాజకీయ నాయకులు, స్థానిక పెద్దలు భరిస్తున్నారు. రామన్నపేట, భువనగిరి, మోత్కూరు, వలిగొండ, తుర్కపల్లి, యాదగిరిగుట్ట తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ సినిమా ప్రదర్శించారు.

పాత రోజులు గుర్తుకు..

బలగం సినిమా పాత రోజులను గుర్తుకు తెస్తోంది. 30 సంవత్సరాల క్రితం ఆది, శనివారాల్లో దూరదర్శన్‌లో వచ్చే తెలుగు సినిమా కోసం.. గురు, శుక్ర వారం రోజుల్లో వచ్చే చిత్రలహరి పాటల కోసం జనం ఎదురుచూసేవారు. అప్పట్లో గ్రామ చావడీ వద్ద (పంచాయతీ కార్యాలయం) టీవీలు ఏర్పాటు చేసేవారు. ఆయా కార్యక్రమాలను వీక్షించేందుకు జనం మధ్యాహ్నం నుంచే బస్తాలు, ఈతకమ్మల చాపలు, గన్నీ బ్యాగులు పరిచి చోటు సంపాదించుకునేవారు. అంతేకాకుండా భారతం, భాగవతం, యక్షగానం, బుర్రకథలు, ఒగ్గు కథలు చూడడానికి జనం చావిడీల వద్దకు చేరేవారు. బలగం సినిమా కూడా పాత రోజులను గుర్తుకు తెస్తుందని ప్రజలు అంటున్నారు.

అనుబంధాలకు ఆయువు పోస్తున్న చిత్రం

బలగం సినిమా బంధాలు, అనుబంధాలకు ఆయువు పోస్తోంది. సినిమా ప్రదర్శిస్తున్న చోట భావోద్వేగాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఒక్కో సన్నివేశాన్ని, పాత్రలను తమలో తాము చూసుకుంటున్నారు. చనిపోయిన తండ్రి ముఖాన్ని హత్తుకుని కూతురు రోదించడం, తండ్రి ముఖం మీద వాలిన ఈగలను తోలి, తల వద్ద ఆరిపోతున్న దీపం వత్తి సరిచేయడం వంటి సన్నివేశాలతో మహిళలు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

చౌటుప్పల్ : పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీలో భాగస్వామ్యం ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. గురువారం చౌటుప్పల్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి ప్రశ్న పత్రం లీకవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమడడం సిగ్గుచేటన్నారు. పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంలో ఏ1గా గుర్తించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన లోక్‌సభ సభ్యత్వాన్నిరద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగదేవి సైదులు, బండారు నర్సింహ్మ, గుంటోజు శ్రీనివాస్‌చారి, గడ్డం వెంకటేష్, రాగీరు కిష్టయ్య, బొడ్డు అంజిరెడ్డి, పల్లె మధుకృష్ణ, ఉప్పలపల్లి బాలకృష్ణ, పల్లె శివ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి



ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న కలుషిత నీరు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని వేపల సింగారం వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కెమికల్స్ కలపడంతో నీరు నలుపు రంగులో వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. గురువారం పలువురు రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు నీరు పెట్టడానికి వెళ్లగా నీరు నలుపు రంగులో రావడంతో కెనాల్ వద్దకు వెళ్లి చూడగా నీరు నలుపు రంగులో ఉండటం గమనించి పొలాలకు నీరు పెట్టడం బంద్ చేశారు. నీటిలో కెమికల్స్ కలిపిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గోవుల పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా గోవులు, పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను గురువారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలోని కిలారి గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే 54 గోవులు, పశువులు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలోని కబేళాకు డీసీఎంలో తరలిస్తుండగా మండలంలోని ధర్మోజిగూడెం శివారులో పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా విజయవాడ సమీపంలో గల హనుమాన్ జంక్షన్‌లో 50పశువులను కొనుగోలు చేసి కంటైనర్ లో కబేళాకు తరలిస్తుండగా తెల్లవారుజామున వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పట్టుబడిన గోవులు, పశువులను గోశాలలకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలని ఈనెల 16న డిండి మండల కేంద్రం నుంచి ఇంటింటికీ సీపీఐ అనే నినాదంతో ప్రారంభం కానున్న బైక్ జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు పరచని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు నేటికీ తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, స్థలం లేని వారికి ప్రభుత్వమే స్థలం కేటాయించి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య నాయకులు రమావత్ అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, పార్లపల్లి కేశవరెడ్డి, కనకాచారి, పోలె వెంకటయ్య, యాసాని పాండురంగారెడ్డి, వెంకటయ్య, జయరాములు, గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ చాంపూలాల్ జాతర



డోలు వాయిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల (సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని పులితండా గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ చాంపూలాల్ స్వామి జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవానికి సూర్యాపేట జిల్లా నుంచే కాకుండా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి గిరిజనులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జాతరకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించారు. వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

వసతులు లేకపోవడంతో ఇబ్బంది..

జాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వ్యవసాయ పొలాలను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

రక్తశుద్ధి కేంద్రంలో ఏసీలకు మరమ్మతులు

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గల రక్తశుద్ధి కేంద్రంలో ఏసీలను ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేయించారు. గురువారం సాక్షి దినపత్రికలో ×రక్తశుద్ధికి నరకయాతన≅ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీజీహెచ్ అధికారులు స్పందించారు. రక్తశుద్ధి కేంద్రంలోని పాడైపోయిన ఏసీలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చారు. దీంతో రక్తశుద్ధి కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు తొలగిపోయాయి. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చే రోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక సేవలో విద్యార్థులు

- వారం రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు
- ప్రజలను చైతన్యం చేయడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 163 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు
- ముగిసిన ప్రత్యేక శిబిరాలు



యాద్గార్‌పల్లిలో వ్యాధులు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు



యాద్గార్‌పల్లిలో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు మార్కుల సాధనే జీవిత లక్ష్యం కాదని సామాజిక స్పృహ కూడా విద్యలో భాగమని నమ్మారు. ఈ లక్ష్యంతో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు 'మా కోసం కాదు– మీ కోసం మేము' అంటూ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు సమస్యలపై గ్రామీణ ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో కళాశాలల్లో అమలు చేస్తున్న జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతున్నాయి. సమాజ సేవ చేయాలని అనుకునే యువతకు వేదికగా ఎన్‌ఎస్‌ఎస్ తోడ్పడుతుంది. దీంతో విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 107 కళాశాలలు ఉండగా వాటిలో 163 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 16,300 మంది వలంటీర్లు గ్రామాల్లో వారం రోజుల పాటు స్పెషల్ క్యాంపు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగంపై నిర్దేశించిన సర్వే నిర్వహిస్తున్నారు.

పథకం ఉద్దేశం

సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలను చూసి నట్లయితే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రజాస్వామ్య విలువలు కాపాడటం, విపత్కర పరిస్థితుల్లో తక్షణం స్పందించడం దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ సంపదలను కాపాడటం, బాధ్యతలను పెంచడం.. దేశ సమగ్రతకు కృషి చేయడం, విద్యార్థులు స్వేచ్ఛా సమానత్వం లౌకిక మొదలైన ప్రవేశిక ఆదర్శాల పట్ల గౌరవ భావాలను పెంపొందింప చేయడం వంటి లక్షణాలను అలవర్చుకుంటారు.

విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు

- ఎన్‌ఎస్‌ఎస్ ధ్రువపత్రాలు పొందిన వలంటీర్లకు ఉన్నత విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు లభిస్తాయి.
- ప్రతి ఏటా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ప్రతిభ గల వలంటీర్లు పాల్గొనే అవకాశం కలుగుతుంది.
- ప్రతి సంవత్సరం ఆయా సమయాల్లో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి ఈవెంట్లలో పాల్గొనే అవకాశం వస్తుంది.
- వలంటీర్లకు స్వయంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభూతి, సంతృప్తి లభిస్తుంది.
- అంతర్ యూనివర్సిటీల్లో జరిగే విశిష్టమైన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం పొందుతారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల ద్వారా విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవా భావాన్ని అలవర్చుకుంటారు.

సంతోషంగా ఉంది



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో అక్షరాస్యతతో పాటు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించవచ్చు. అంతే కాకుండా స్వచ్ఛ భారత్, మురుగు కాల్వల శుభ్రత, హరితహారం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది.

– ఎస్‌కె. రిజ్వానా, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

సేవతో పాటు గుర్తింపు



దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం చేసే విధంగా ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో పాల్గొనే వలంటీర్లకు క్రమ శిక్షణ అలవడుతుంది. దీనిలో సేవ చేసే అవకాశంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుంది.

– మద్దిలేటి, ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో– ఆర్డినేటర్

సామాజిక అంశాలపై అవగాహన



విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో పాల్గొంటే ధ్రువపత్రాలు అందజేస్తాం. పనితీరు బాగుంటే గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందుకోవచ్చు. వీటి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో సీట్లు పొందే అవకాశం ఉంటుంది.

– నర్సింగ్ కోటయ్య, కెఎన్‌ఎం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్

గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా



మాట్లాడుతున్న మోతె పిచ్చిరెడ్డి

ఆత్మకూరు(ఎం): తాను పుట్టిన ఊరి అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి అన్నారు. ఆయన తన స్వగ్రామమైన మండలంలోని కూరెళ్ల గ్రామంలో తన ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అక్షర కళాభారతి గ్రంథాలయాన్ని గురువారం దాశరథి అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాలను పునఃనిర్మాణం చేయించానని తెలిపారు. రూ.18లక్షలతో పశువైద్యశాల భవనం నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగుల కోసం గ్రంథాలయం ఉండాలన్న లక్ష్యంలో తన ఆర్థికసాయంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామానికి వైకుంఠ రథం అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్షర కళాభారతి ఆధ్వర్యంలో ఆచార్య కూరెళ్ల విఠలాచార్యను, మోతె పిచ్చిరెడ్డి, పూలమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కూరెళ్ల రమేష్, సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్యయాదవ్, వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మ, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ, ఉప సర్పంచ్ కొమ్ము నరేష్, పశువైద్యాధికారి వల్లాల సంతోష్‌కుమార్, కమిటీ ఉపాధ్యక్షుడు సూదగాని లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి భిక్షం, కార్యదర్శి గడ్డం అశోక్, కోశాధికారి ఉప్పల నర్సింహ పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలో పరీక్షకు హాజరైన విద్యార్థిని



ఎస్సెస్సీ పరీక్షాకేంద్రం వద్ద కీర్తన

శాలిగౌరారం: ఇంట్లో తండ్రి మృతదేహం ఉన్నప్పటికీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎస్సెస్సీ పరీక్ష కావడంతో పుట్టెడు దుఃఖంలో ఓ విద్యార్థిని గురువారం ఎస్సెస్సీ పరీక్షకు హాజరైంది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన మాదగోని సైదులు(39) రెండవ కుమార్తె కీర్తన స్థానికంగా మోడల్‌స్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు రాస్తుంది. అయితే, కీర్తన తండ్రి సైదులు బుధవారం రాత్రి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. వెంటనే సైదులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగా.. పరీక్షకు వెళ్లలేక శోకసంద్రంలో ఉన్న కీర్తనను బంధువులు ఓదార్చి పరీక్షకు వెళ్లేలా మనోధైర్యం కల్పించారు. దీంతో గురువారం ఉదయం పరీక్షకు హాజరై.. తిరిగి వెళ్ళిపోయి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది. కాగా, కీర్తన తండ్రి సైదులు అంత్యక్రియలు గురువారం సాయంత్రం జరిగాయి. కీర్తన సోదరి సోని తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది.

తండ్రీకూతురు ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మృతి
- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూతురు
- కుటుంబ కలహాలతో కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలుపుకొని ఘాతుకం



తండ్రి లతీఫ్‌తో కూతురు హసీనా

పాలకవీడు: కుటుంబ కలహాలతో తండ్రీకూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో తండ్రి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్(40) గ్రామంలోనే ఉంటూ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య లతీఫ్‌బీ, కుమారుడు నాగుల్‌మీరా, కుమార్తె హసీనా ఉన్నారు. కాగా జనవరి 3న కుమారుడు నాగుల్ మీరా ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అప్పటి నుంచి లతీఫ్ పనికి వెళ్లకుండా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. కుటుంబ పోషణ భారం కావడంతో కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి లతీఫ్ మిర్యాలగూడకు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. కాగా వారం క్రితం లతీఫ్ తన భార్యతో గొడవపడి కూతురుతో కలిసి స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. అయితే ఈ నెల 5వ తేదీన లతీఫ్, హసీనా కలిసి మిర్యాలగూడలో ఉంటున్న భార్య దగ్గరకు వెళ్లగా అక్కడ ముగ్గురికి మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన తండ్రీకూతురు తిరిగి గుడుగుంట్లపాలెంలోని తమ ఇంటికి వచ్చి గురువారం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గుర్తించి ఇరువురిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లతీఫ్ మృతిచెందాడు. మృతుడి కుమార్తె హసీనా మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హసీనా చిన్నమ్మ షేక్ లాల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వరికోత మిషన్ కింద పడి రైతు మృతి

కనగల్: వరికోత మిషన్ కింద పడి రైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని జంగమయగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగమయగూడెం గ్రామానికి చెందిన నూనె సోమయ్య(70) బుధవారం సాయంత్రం వరికోత మిషన్‌ను పిలిపించి తన వరి పంటను కోపిస్తున్నాడు. వరికోత మిషన్ వెనక సోమయ్య వరి పరిగెలను కోస్తున్న క్రమంలో మిషన్ డ్రైవర్ నల్లబోతు రాములు అతివేగం, అజాగ్రత్తతో నడిపి సోమయ్యపై వెనుక టైర్ ఎక్కించడంతో చాతి భాగంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పక్కనే ఉన్న సోమయ్య కుమారుడు సైదులు గమనించి వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం మృతుడి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వరికోత మిషన్ ను సీజ్ చేసి, వరికోత మిషన్ డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

నకిరేకల్: మండలంలోని చందంపల్లిలో బావమరదిని హత్య చేసిన కేసులో బావతో పాటు అతడి స్నేహితుడిని గురువారం పోలీసులు రిమాండ్ చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం యండ్లపల్లికి చెందిన యానాల సాయికుమార్ (24) తల్లి భిక్షమమ్మతో కలిసి అమ్మమ్మ ఊరైన నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామానికి వచ్చారు. సాయికుమార్ నిత్యం మద్యం సేవిస్తూ తల్లి భిక్షమమ్మతో తరచూ గొడవ పడుతుండడంతో ఆమె హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటున్న తన అల్లుడు యారాల విజయ్‌కుమార్‌రెడ్డికి ఫోన్‌లో విషయం చెప్పింది. దీంతో ఈ నెల 3న యారాల విజయ్‌కుమార్‌రెడ్డి తన స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని తీసుకుని చందంపల్లి వచ్చి సాయికుమార్‌తో గొడవ విషయమై మాట్లాడారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సాయికుమార్ తలపై విజయ్‌కుమార్‌రెడ్డి పారతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సాయికుమార్‌ను నకిరేకల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యారాల విజయ్‌కుమార్‌రెడ్డి, అతడి స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని గురువారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



చౌడంపల్లి నర్సరీలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి : పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవని నల్లగొండ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలతో పాటు చౌడంపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరం, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కేంద్రాల వద్ద బ్యానర్లు పెట్టకపోవడంతో పాటు నర్సరీల నిర్వహణ విషయంలో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ పులి సైదులు, ఎంపీడీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

అన్నెపర్తిలో నర్సరీ పరిశీలన

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామ నర్సరీని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ వద్ద ఆర్చి ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం శ్మశానవాటికను పరిశీలించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్త్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నార్కట్‌పల్లి: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని నెమ్మాని గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినతుమ్మలగూడెం గ్రామానికి చెందిన బండారు రవీందర్‌రెడ్డి నార్కట్‌పల్లి నుంచి చినతుమ్మలగూడేనికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో నెమ్మాని గ్రామ సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బండారు రవీందర్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చౌటుప్పల్ మండలంలో వృద్ధురాలు..

చౌటుప్పల్: మండలంలోని దండుమల్కాపురం గ్రామపంచాయతీ మధిర గ్రామమైన బొర్రోళ్లగూడెం శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన సంగిశెట్టి శకుంతల(70) కొంతకాలంగా పోచంపల్లి మండలం మెహర్‌నగర్ శివారులోని మాణిక్యేశ్వరీమాత దేవాలయ ఆవరణలో గల ఆశ్రమంలో ఉంటుంది. బుధవారం రాత్రి పని నిమిత్తం ఆశ్రమంలోనే ఉంటున్న మరో వృద్ధురాలు అయిటి పాముల విజయమ్మతో కలిసి శకుంతల హైదరాబాద్‌కు వెళ్లేందుకు బొర్రోళ్లగూడెం జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. అక్కడ హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ శకుంతలను ఢీకొట్టింది. విజయమ్మ ముందుగానే హైవే దాటడంతో ఆమె ప్రమాదం తప్పింది. కాగా తీవ్రంగా గాయపడిన శకుంతలను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి బంధువు కళమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీత పాండు తెలిపారు.

దిర్శించర్లలో వరికోత మిషన్ ఢీకొట్టి..

నేరేడుచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని దిర్శించర్లలో చోటు చేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దిర్శించర్ల గ్రామానికి చెందిన యాతవాకిళ్ల లచ్చయ్య(56) టీవీఎస్ ఎక్సెల్‌పై గ్రామానికి వెళ్తుండగా వరికోత మిషన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లచ్చయ్యకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి ముఠాను వెంటాడి పట్టుకున్న పోలీసులు



నిందితుడిని వెంటాడి పట్టుకున్న మునగాల సీఐ ఆంజనేయులు, సిబ్బంది



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

- సహకరించిన హైవే పెట్రోలింగ్ పోలీసులు, స్థానిక యువత
- 120 కేజీల గంజాయి స్వాధీనం

మునగాల(కోదాడ): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గురువారం మునగాల శివారులో స్థానికులు, పోలీసులు వెంటాడి మరీ పట్టుకున్నారు. వివరాలు.. మునగాలలో స్థానిక సీఐ పి. ఆంజనేయులు తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారు రోడ్డుపై ఏర్పాటు చేసిన రెండు స్టాపర్లను ఢీకొట్టి ఆగకుండా వెళ్తుండగా వెంటాడి మరీ ఆపారు. కారులో తనిఖీ చేయగా సుమారు 120కేజీల గంజాయి దొరికింది. కారులోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంటుడగా అందులో ఒకరు పోలీసుల కళ్లుగప్పి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో సీసిఐ ఆంజనేయులు తన సిబ్బందితో పారిపోతున్న వ్యక్తి వెంటపడ్డారు. చివరకు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంజలూరు వద్ద పారిపోతున్న వ్యక్తిని హైవేపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది, స్థానిక యువకుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. కాగా శుక్రవారం ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై సీఐ ఆంజనేయులును వివరణ కోరగా ఆయన గంజాయి పట్టుబడినట్లు ధృవీకరించారు. సీఐ వెంట మునగాల ఎస్‌ఐ పి. లోకేష్, సిబ్బంది ఈశ్వర్, సుదర్శన్ ఉన్నారు.